# భయం

భయమనేది వివిధ రూపాల్లో, వివిధ స్థాయిల్లో వ్యక్తుల్ని పట్టుకొని పీడిస్తుంది. చీకటీ, నీరూ, ఎత్తూ, రోగాలూ, మరణమూ మొదలైనవి వ్యక్తిగతమైన కొన్ని భయాలకి కారణాలై ఉండగా, చదువులూ, పరీక్షలూ, ఉద్యోగాలూ, ధనార్జనా, తదుపరి ధన రక్షణా ఇత్యాది, వాటికనుగుణమైన భయాందోళనలని కలుగజేస్తాయి. ఇవే కాకుండా, సాంఘిక జీవికి సాంఘిక, మత, కులాచారాలు కొన్ని కొన్ని భయాల్ని సృష్టిస్తాయి. ఏం చేస్తే, లేదా ఏం చెయ్యకపోతే ఎవరేమనుకొంటారోనన్న భయాలు - తప్పని సరి ఆనవాయితీల పేరిటా, మొహమాటాల పేరిటా, శుభాశుభ కార్యాల్లో తలెత్తుతూ ఉంటాయి. ఫలితంగా చాలామంది అతి సాధారణ విషయాలపై ఖర్చు చేసి, అత్యవసర పరిస్థితి వచ్చేసరికి ఋణాల కోసం దారులు వెదకవలసి వస్తుంది.

ఊళ్ళోనే వివాహం జరుగుతున్న బంధువుల పిల్లకి, పెళ్ళి కానుక కొనే నిమిత్తం డబ్బు కావాలనీ, జీతం వచ్చిన వెంటనే తిరిగి యిచ్చేస్తాననీ అడిగిన 'సక్సేనా'కి అయిదు వందలిచ్చిన తర్వాత, నాలో ఈ విధమైన ఆలోచనలు కలిగాయీ అంటే, నా జాగ్రత్త స్వభావం మీకు కొద్దిగా అర్థమయ్యే ఉండాలి?

సెక్రటరీ 'ఉష' నా బల్ల మీద పెట్టిన అర్జంటు కాయితాల మీద ఏ విధమైన చర్యలు తీసుకోవలసిందీ వ్రాసి, సంతకాలు పెట్టి, ఆఫీసు వదిలి, యిల్లు చేరేసరికి రాత్రి ఎనిమిదైంది. సుభద్ర కాఫీ కప్పుతో బాటు, పసుపు పూసిన మూలలతో ఉన్న ఓ ఉత్తరం కూడా అందించింది. ఆ ఉత్తరాన్ని చూడగానే అనిపించింది, అది మరో ఇంటి ప్రయాణానికి 'నాంది' అని. కాఫీ తాగుతూ, ఎదురుగా కూర్చున్న సుభద్ర కేసి ప్రశ్నార్థకంగా చూశాను. ఉత్తరాన్ని చదవమని సైగ చేసింది. గడుసు మనిషి!

ఉత్తరం కాకినాడ నుంచి నా తోడల్లుడు వ్రాసింది. ఆయన మూడో పుత్రరత్నానికి ఉపనయనం. కుటుంబ సమేతంగా రావల్సిందని, ఆయన స్వహస్తాలతో వ్రాసి పంపిన ఆహ్వానం. చదివి, పక్కనున్న టెలిఫోన్ బల్ల మీద పడేశాను. ఆ పడేయడంలో కాస్త విసుగూ, విసురూ కనిపించిందనుకొంటాను, "అంతేనంటారా?" అని ప్రశ్నించింది సుభద్ర.

"మీ అక్కగారి రెండో కూతురు 'సుమ' పెళ్ళికి వెళ్ళి, తిరిగొచ్చి ఇంకా మూణ్ణెలలైనా కాలేదు, అప్పుడే మరో ప్రయాణమంటే మాటలు కాదు! ఈ వడుగు కూడా ఆ పెళ్ళితో బాటు చేసేస్తే సరిపోయేది కదా! చీటికి మాటికి ఇలా సెలవు పెట్టడం బావుండదు!" నా మాటల్లో నా తోడల్లుడి మీదా, వదినగారి మీద కాస్తంత కోపం చూపించాను.

"ముహూర్తాలు కుదిరితే, అలానే చేసుండేవారు! ఒకేసారి చేస్తే, మనకే కాదు, వాళ్ళకీ ఖర్చు కలిసొచ్చేది!" సుభద్ర, అసలు విషయం డబ్బు గురించి కాని సెలవు గురించి కాదని సన్నగా, చిన్నగా దెబ్బతీసింది మాటల్లో.

"తాతలు సంపాదించిన ఎకరాలు సాగుబడి చేసుకుంటూ, ఉన్న ఊళ్ళోనే 'లా' ప్రాక్టీస్ చేస్తున్న మీ బావగారు ఇల్లు కదలకుండా ఏడాదికెన్ని శుభకార్యాలైనా చేస్తారు! దూర ప్రాంతాలలో ఉద్యోగాలు చేస్తున్న వాళ్ళకి, బంధువులిళ్ళలో మాటిమాటికీ శుభ కార్యాలకి హాజరవాలంటే, వ్యయ ప్రయాసలతో కూడిన పని. వీలుకి సంబంధించిన విషయం. రాలేదని నింద వేస్తే, చెయ్యగలిగిందేమీ లేదు!" తను డబ్బు సంగతి సంభాషణలోకి లాక్కొచ్చింది కాబట్టి, నేనూ ఖర్చు సంగతి వేలెత్తి చూపాను. నేనన్న మాటలకు సుభద్ర ఊరుకోదని తెలుసు.

"ఎవరి అదృష్టాలు వారివి! ఒకళ్ళతో పోల్చుకోవడం అనవసరం. అయినా, మనం వెళ్ళకపోతే వాళ్ళు నింద వేస్తారని కాదు,మనకే సభ్యతగా ఉండదేమోనని నా భయం!" సుభద్ర మాటల్లో, నా మాటలకి సమాధానంగా కొంచెం ఎత్తి పొడుపు ధ్వనించింది.

"అనుకోకుండా సుమకి అమెరికా సంబంధం కుదిరింది,మీరు వెంటనే బయలు దేరి రండి, అన్న మీ బావగారి టెలిఫోన్ సందేశం అందిన వెంటనే నువ్వంటూన్న ఆ గౌరవ మర్యాదలు కాపాడుకోవడం కోసమే కదా ఆఫీసులో ఎంత పని ఒత్తిడి ఉన్నా సెలవు పెట్టి వెళ్ళింది! ఎండాకాలం ప్రయాణంలో ఎంత శ్రమ పడిందీ, ఎంత ఖర్చయిందీ నీకు తెలియంది కాదు! అయినా ఇంతలోనే, ఏ విధమైన ఆలోచనా లేకుండా మళ్ళీ కాకినాడ ప్రయాణం కోసం పట్టు పట్టడం భావ్యం కాదు! ఇంత స్వల్ప వ్యవధిలో మీ అక్కగారి మూడో కొడుకు వడుగు కోసం, అంత దూరం ప్రయాణం చెయ్యడానికి నా దగ్గర ఓపికా లేదు, తగినంత డబ్బూ లేదు, సరేనా?" అన్నాను.

"నిజంగా డబ్బు లేదనుకొంటే అనుకోవచ్చు! కాని అసలు నిజం, మీకు డబ్బు ఖర్చు పెట్టడం యిష్టం లేదు!"

"అవును, ప్రాణావసరానికి కావల్సిన మందులకి తప్ప, అయిదు రూపాయలు విలువ చేసే వారపత్రికని కొనడం కోసం రానూ పోనూ పదిహేను రూపాయలు ఆటో రిక్షా మీద తగలెట్టడం నాకు చేతకాని పని! అవసరమైనప్పుడు, ఎప్పుడూ నేను ఖర్చుకి వెనుకాడలేదు. సుమ పెళ్ళికి వెళ్ళినప్పుడు, నా హోదా, నా గౌరవం అంటూ - నువ్వెంత ఖర్చు చేసిందీ మర్చిపోయినట్లున్నావ్! ప్రస్తుతం బ్యాంక్‌లో ఎంత డబ్బున్నదీ నీకు తెలుసు. పాస్ బుక్ నీ దగ్గరే ఉంది"

"అవును మరి, అక్కడ నోరు మూసుకొని అడిగిందల్లా యిచ్చి తిరిగొచ్చిన తర్వాత వారం రోజు మీరు చేసిన సణుగుడు మర్చి పోయారు! ఇవ్వడం ఇష్టం లేకపోతే మొదట్లోనే చెప్పాలి కాని, యిచ్చి సాధించడం సమంజసం కాదు! ఇంతకీ మీరు డబ్బు లేదంటున్నారు కానీ, మీకూ, మన 'రవి'కీ సహకార బేంక్‌లో ఉన్న ఉమ్మడి ఖాతాలో పాతిక వేలకి పైగా ఉందనుకొంటాను?!" సుభద్ర అదోలా చూస్తూ, కాస్త వ్యంగ్యంగా అంది.

ఆ ఎకౌంట్‌లో నేను నెలసరిగా దాదాపు పది సంవత్సరాలుగా వచ్చిన జీతంలోంచి అంతో యింతో వేస్తూ, పొదుపు చేస్తూ వచ్చాను. ఈ విషయం సుభద్రకి నేనెప్పుడూ చెప్పలేదు.

"ఈ విషయం నీకెలా తెలుసు?!" ఆశ్చర్యపోతూ అడిగాను.

"నిన్న మొన్నటి వరకూ మన జాయింట్ ఎకౌంట్ గురించి తప్ప, ఈ వేరే పొదుపు కార్యక్రమం నాకు తెలియదు. మొన్న రవి 'కాన్పూర్' నుంచి వచ్చినప్పుడు, మీరు వాణ్ణి సహకార బేంక్‌కి తీసుకువెళ్ళి, ఇంతవరకూ మీ పేర్న ఉన్న ఎకౌంట్‌ని జాయింట్ ఎకౌంట్‌గా మార్పించారని చెప్పాడు!"

"అంతేనా, ఇంకా ఏమైనా చెప్పాడా?" కొంచెం ఆతృతగానే అడిగాను.

"ఇంకేమీ చెప్పలేదు. అదైనా నోరు జారి చెప్పాడు. వివరాలడిగితే బిగుసుకు పోయాడు! నా దగ్గర దాచిన ఈ విషయం తెలిసిన వెంటనే, నా ప్రాణం ఎంత ఉసూరు మందో మీకేం తెలుసు?! మిమ్మల్నిబ్బంది పెట్టడం యిష్టం లేక, దాన్ని గురించి మిమ్మల్ని ప్రశ్నలడగలేదు. ఊరికే డబ్బు లేదని గోల పెడ్తున్నారు కాబట్టి, ఇప్పుడడగవలసి వచ్చింది!" సుభద్ర ఎగతాళిగా అంది.

"నా జీతం చెక్ బేంక్‌కి వెడ్తోంది. ఇంటి ఖర్చులకి కావల్సినన డబ్బంతా నువ్వే బేంక్‌లోంచి తీస్తున్నావ్! ఏం ఖర్చు చేస్తున్నదీ, ఎలా ఖర్చు చేస్తున్నదీ నిన్నెప్పుడైనా అడిగానా? దుబారా చేస్తున్నావో, పొదుపే చేస్తున్నావో నీకే తెలియాలి!"

"నేను మట్టుకు వెనకేసుకుని పట్టు చీరలు కొన్నానా, నగలు చేయించుకొన్నానా? అయిన ఖర్చంతా యింటికే అవుతోంది. అందులో మీ సాదరుకే నాలుగైదు వందలు గుంజేస్తున్నారు! ఇంటి విషయాల్లో ఏదో కాస్త స్వతంత్రం యిచ్చారు కాని, యితర విషయాలన్నీ మీరే చూసుకొంటున్నారు. నేను మట్టుకు, 'మీరేం చేస్తున్నారు, ఎలా ఖర్చు పెడ్తున్నారు?' అని ఎప్పుడైనా అడిగానా?" సుభద్ర మొండిగా, మాటకు మాట సమాధానం యిస్తూ పోయింది.

"నేను సహకార బేంక్‌లో పొదుపు చేస్తున్న డబ్బెక్కణ్ణించి వస్తోందనుకొంటు న్నావ్? నా సాదరు ఖర్చుకని తీసుకొన్న డబ్బులో మిగిలినదంతా నెల చివర్న అదా చేస్తూ వచ్చాను. సిగరెట్లు కాల్చడం మానేసి నప్పట్నుంచీ, ఏదో కాఫీ, టీలకు తప్పించి నాకు మట్టుకు ఖర్చేముందని?" సుభద్రకి ఓ రహస్యం చెప్పేశాను.

"అంటే నా చేతికి డబ్బు యిచ్చినట్లుగానే యిచ్చి, అందులోంచే మీరు వేరే పొదుపు ఉద్యమం మొదలెట్టారూ అంటే, అది నా మీద నమ్మకం లేనట్లేగా? అయినా తెలియ కడుగుతాను, రవి పెద్ద చదువులకనీ, రమ పెళ్ళి కోసమనీ మీరు వేరే నెలసరి డిపాజిట్లు చేస్తుండగా, గుంభనగా ఈ అదనపు పొదుపు కార్యక్రమం చేబట్టారెందుకని?" సుభద్ర నిష్కర్షగా అడిగింది.

నేను కొంచెం యిరుకులో పడ్డాను. "కొన్నింటికి కారణాలు చెప్పకుండా ఉండడమే మంచిది. చెబ్తే అంతగా నచ్చవు!" అన్నాను.

"ఇన్నేళ్ళు కాపురం చేసిన తర్వాత కూడా, నా మీద నమ్మకం లేకపోవడం నా దురదృష్టం! అయినా, మీ వాళ్ళకేదైనా సహాయం చెయ్యడానికి నేనెప్పుడైనా అడ్డు పడ్డానా, ఇలా రహస్యంగా డబ్బు నిలువ జేస్తున్నారు?!" సుభద్ర సంభాషణ దారి తప్పు తోన్నట్లనిపించింది.

నేనొక్క క్షణం తటపటాయించాను. ఓ రహస్యాన్ని చెప్పిన తర్వాత, దాని వివరాలు కూడా చెప్పడం శ్రేయస్కరమనిపించింది. గొంతు సవరించుకొంటూ అన్నాను.

"మనం ఉంటున్నది ఇక్కడ డెహ్రాడూన్‌లో. ఇంటికి దూరంగా ఉత్తర భారతంలో. ఏ రోజునా మన బేంక్ బాలెన్స్ పది పన్నెండు వేలకి మించలేదు. ఒక్కో శుభ కార్యానికి వెళ్ళినప్పుడు కాని, లేదా యింటికి సెలవు మీద వెళ్ళినప్పుడు కాని పది వేల కెప్పుడూ తక్కువ ఖర్చు కాలేదు. అడపా దడపా ఏవో బోనస్‌లూ, అవీ వస్తే తప్ప పాస్ బుక్‌లో పది వేలకు మించిన సంఖ్య సంభవం కాదు. యింటి దగ్గరేమైనా అవాంతరాలు సంభవిస్తే, ఇంత దూరంలో వున్న మనకి, ఈ పాటి నిలవ చాలదు గాక చాలదు! ఎదురుగా డబ్బు కనబడుతూ ఉంటే, కొన్ని అనవసరాలు కూడా, అవసరాలుగా మారిపోతాయి. ఇది నీకూ, నాకూ అందరికీ వర్తిస్తుంది!!"

"అంటే..?" సుభద్ర అయోమయంగా ప్రశ్నించింది.

"సరే, నిన్నింకా అయోమయ స్థితిలో ఉంచడమెందుకు. విను. మా తాతగారు పోయినప్పుడు, నాన్నగారి చేతిలో చిల్లిగవ్వ లేదు. అంత్య క్రియలు జరిపించడానికాయన ఎంత అవస్థ పడ్డారో, నేను కళ్ళారా చూశాను. ఆనాటి నుంచీ నాకదో రకమైన భయం. మన సమాజంలో మనిషి పుట్టినప్పుడు తల్లిదండ్రులకీ, గిట్టినప్పుడు సంతానానికీ ఖర్చు తప్పదు! ఆస్తిపరుల సంగతటుంచి, దిగువ మధ్య తరగతి కుటుంబాలు, శుభాశుభ కార్యాలకై సమయానికి డబ్బు లేక ఇబ్బందులు పడటం మనం చూస్తున్నదే! జన్మనిచ్చిన నా తల్లిదండ్రులూ, నిన్ను నాకు ధారపోసిన నీ తల్లిదండ్రులూ వయసు మీరారు. ప్రాణాల మీదకు వచ్చినా, లేదా ప్రాణాలు పోయినా, తక్షణం అక్కడకు చేరి అండగా నిల్చోవడమో, లేదా కర్మకాండలు చెయ్యడమో మన విధి. ఈ విధి నిర్వహణలో ఏది సకాలంలో జరగక పోయినా, సవ్యంగా జరగకపోయినా మాట వచ్చే ప్రమాదం ఎక్కువ. అందుకే ఈ జాగ్రత్త! ఇంకా విను. రవి పేరు జాయింట్ ఎకౌంట్‌లో ఎందుకు చేర్పించానంటే - ఒకవేళ నాకేమైనా...?"

నా మాటల్ని సుభద్ర ఆపేసింది. నాకేసి రెప్పలార్పకుండా చూస్తున్న ఆ కళ్ళలో నీటి పొరలు!

"ఇవేం అశుభం మాటలండీ? అయినా మీకివేం ఆలోచనలు?! ఎక్కడ మొదలు పెట్టిన మాటలు ఎక్కడికి దారి తీశాయి?! మీతో వాదించడం నాదే బుద్ధి పొరపాటు!" కళ్ళు చీర కొంగుతో తుడుచుకొంటూ అంది.

"చూడు సుభద్రా, ఇవన్నీ తప్పు పట్టకూడని నిజాలు? చావు భయంతో చావగొట్టి, జీవిత భీమా చేయిస్తాడు ఏజెంటు! అందులో ఉన్న అశుభపుటాలోచనని పక్కకి నెట్టి, ఓ పొదుపు పథకంగా పాలసీ తీసుకోవడం జరుగుతుంది. ఇది, నేను స్వయం పథకం కింద తీసుకొన్న పాలసీ! ఉపయోగమేమిటంటే, ఇటువంటి అవసరాలు వచ్చినప్పుడు, వేరే నిధి చేతికందుబాటులో ఉంటుంది" లేచి వెళ్ళి, సుభద్ర భుజం మీద చెయ్యి వేసి, అనునయంగా అన్నాను.

"ఇంక చాలు! రాజుగారి అంత్య క్రియల కోసం ఎండు గంధం చెక్కలు అటక మీద

దాచిన చాకలి వాడిలా ఉంది మీ వ్యవహారం!" అంటూ భుజం మీద వేసిన నా చేతిని తొలగించి, వంటింట్లోకి దారి తీసింది సుభద్ర.

అదే క్షణంలో అంతవరకూ నేనూహించని మరో విషయం నన్ను వెన్ను చరిచింది. ఈ విషయంలో నా మరణ చింతనకు సంబంధించిన మేరకు, నాకు కర్మకాండలు చెయ్యడానికి రవికి ధన సదుపాయం కలుగజేసే దృక్పథంలోనే ఆలోచించాను కానీ, వాడా ఉత్తర క్రియలు చేయడానికి కావల్సిన అధికారం కలుగజేయడానికి, సాంప్రదాయ బద్ధంగా మట్టుకు ఆలోచించనే లేదు! నా తోడల్లుడు ముచ్చటగా మూడో కొడుక్కి కూడా వడుగు చేస్తూంటే, నేను మా ఒక్కగానొక్క కుర్రాడికి వయసొచ్చినా, వడుగును గురించి ఆలోచించక పోవడం, ఆ క్షణంలో విచిత్రంగా అనిపించింది.

రెండు మూడు రోజుల్లో రాబోయే జీతాల పెంపుదల బకాయిల్ని దృష్టిలో ఉంచుకొని, తోడల్లుడికి టెలిఫోను చేశాను. రవికి కూడా వెంటనే ఏదైనా వడుగు ముహూర్తం పెట్టించమని. వాళ్ళ కుర్రాడికి ఉపనయనం చేసే ముహుర్తం ఆఖరిదనీ, సర్వసమ్మతమైన దనీ, మళ్ళీ రెండేళ్ళ వరకూ ముహూర్తాలు లేవనీ, అదే ముహూర్తానికి ఇద్దరి వడుగూ ఒకే మంటపంలో చేయిద్దామనీ - ఆయనన్న మాటలకి నేను వెంటనే అంగీకారం తెలిపేశాను.

అసలు వడుక్కే వెళ్ళొద్దన్న వాణ్ణి. రవికి కూడా అదే ముహూర్తంలో, వాళ్ళ అక్క కొడుకుతో బాటు ఉపనయనం చేసేద్దామన్న నా నిర్ణయానికి సుభద్ర విస్తుపోయింది. ఉపనయనానికి డబ్బెలా సమకూరేది చెప్పానే కాని, ఎందుకు చేస్తున్నదీ కారణం మట్టుకు చెప్పలేదు. ఒకవేళ సుభద్ర కూడా కారణం ఊహించుకోగలిగినా, తనూ, నేనూ చెయ్యగలిగిందేమీ లేదు. ఉపనయనమనేది ఓ తంతు. అది వివాహానికి ముందు మెట్టుగానే కాదు, కన్నవాళ్ళకి తలకొరివి పెట్టి, ఉత్తర క్రియలు చెయ్యడానికి బ్రాహ్మణ్యం యిచ్చే సర్టిఫికెట్!

★ ★ ★

**ఉపశ్రుతి:**

"అయ్యా, మీకు మెళ్ళో జంధ్య ముందా?" పురోహితుడు ప్రశ్నించాడు.

"లేదు. అద్దె కొంపల్లోనూ, కంపెనీ క్వార్టర్లలోనూ, యజ్ఞోపవీతం పవిత్రతని కాపాడ్డం సాధ్యంకాని పని. ఈ భయం చేత అసలు జంధ్యమే వేసుకోవటల్లేదు!" అన్నాను.

"జంధ్యాన్నే తీసి పారేసినవారు మీకు గాయిత్రి జ్ఞాపకం ఉంటుందని అనుకోను! మీరు మీ కుమారునికి బ్రహ్మోపదేశం చెయ్య డానికి, ముందు మీ మెళ్ళో జంధ్యముండాలి! పునః యజ్ఞోపవీత ధారణ చేయిస్తాను. ఆచమనం చెయ్యండి... ముక్కు పట్టుకోండి... 'మమ' అనండి..."

('రచన' మాసపత్రిక : 1998)